# వారం సెలవు అనంతరం నేడు విధులకు సిఎస్

**హైదరాబాద్, నవంబరు 6, ప్రభాతవార్త :** వారం రోజుల సెలవు అనంతరం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఈ నెల 7వ తేదీన తిరిగి విధులకు హాజరు కానున్నారు. ప్రస్తుతం సెలవులో ఉన్న చీఫ్ సెక్రటరీ అమెరికాలో ఉన్న తన కుమార్తె దగ్గరకు వెళ్లినట్లు సమాచారం. గత నెల 31వ తేదీ నుండి ఈ నెల 6వ తేదీ వరకూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సెలవులో ఉన్నారు. సాధారణంగా సీఫ్ సెక్రటరీ వారం రోజుల సెలవులో ఉన్న సమయంలో పరిపాలనాపరమైన సమస్యలు తలెత్త కుండా ఆ బాధ్యతలను మరో సీనియర్ అధికారికి అప్పగిస్తుండటం సర్వసాధారణం. అయితే అత్యవసర అంశాలకు సంబంధించి అందుబాటులో ఉంటానని చీఫ్ సెక్రటరీ తెలియచేయంతో రాష్ట్ర ప్రభుత్వం ఎవరికీ ఈ బాధ్యతలను అప్పగించ లేదని అధికార వర్గాలు వెల్లడించాయి.

# రాష్ట్రంలో ఫార్మా కంపెనీల భారీ పెట్టుబడులు

### ముందుకొచ్చిన ఐదు దిగ్గజ ఫార్మా కంపెనీలు

### ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

### మంత్రితో సమావేశమైన డా.రెడ్డీస్, అరబిందో, హెటిరో, లారస్, ఎంఎస్ఎన్

**హైదరాబాద్, నవంబరు 6, ప్రభాతవార్త:** హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీలో యుద్ధ ప్రాతిపదికన మౌలిక సదుపాయాలు అభివృద్ధి చేసి ఏడాది కాలంలో పరిశ్రమల నిర్మాణానికి ఏర్పాట్లు సిద్ధం చేస్తున్నట్టు ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. రాష్ట్రంలోని ఐదు దిగ్గజ ఔషధ కంపెనీల ప్రతినిధులతో ఆయన బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో డా.రెడ్డీస్, అరబిందో, హెటెరో, లారస్, ఎంఎస్ ఎన్ మందుల కంపెనీల ప్రతినిధులు పాల్గొని తమ ప్రతిపాదనలను పంచుకున్నారు. ఈ కంపెనీలు ఫార్మాసిటీలో భారీ పెట్టుబడులు పెట్టడానికి సంసిద్ధత వ్యక్తం చేయడం పట్ల శ్రీధర్ బాబు హర్షం వ్యక్తం చేసారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆలోచనల మేరకు ఏర్పాటు కానున్న ఫ్యూచర్ సిటీలో ఫార్మా నగరం కూడా భాగంగా ఉంటుందని తెలిపారు. ఈ ఐదు ఫార్మా కంపెనీల్లో ప్రస్తుతం రెండు లక్షల మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. తొలి దశలో ఒక్కో కంపెనీ 50 ఎకరాల స్థలంలో పరిశ్రమ ఏర్పాటు చేయడానికి ప్రతిపాదించినట్టు శ్రీధర్ బాబు తెలిపారు. గ్రీన్ ఫార్మా సిటీకి మంచినీరు, విద్యుత్తు సరఫరా పనులు ఇప్పటికే ప్రారంభమైనట్టు ఆయన చెప్పారు. కొంగరకలాన్ నుంచి రీజనల్ రింగ్ రోడ్ వరకు 300 అడుగుల వెడల్పుతో ప్రపంచ స్థాయి రహదారి నిర్మించనున్నట్టు ఆయన తెలిపారు. దీనికి సంబంధించి ఇప్పటికే నోటిఫికేషన్ వెలువడిందని వివరించారు. వచ్చే జూన్ నాటికి ఈ రోడ్డు టెండర్ల ప్రక్రియ పూర్తవుతుందని చెప్పారు. రోడ్డుకు సమాంతరంగా మెట్రో రైలు వ్యవస్థను కూడా ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. భారీ ఫార్మా పరిశ్రమల కోసం లాజిస్టిక్స్ పార్క్, ప్యాకేజింగ్ పార్క్, కార్మికుల కోసం డార్మిటరీలు నిర్మిస్తామని వెల్లడించారు. టీజీఐఐసీ నీటిని నేరుగా సరఫరా చేస్తుందని వివరించారు. త్వరలో పరిశ్రమల విద్యుత్తు విధానాన్ని ప్రకటించనున్నట్టు శ్రీధర్ బాబు వెల్లడించారు. ఈ సమావేశంలో టీజీఐఐసీ ఎండీ డా. విష్ణువర్ధన్ రెడ్డి, పరిశ్రమల శాఖ డైరెక్టర్ డా. మల్సూర్‌లు పాల్గొన్నారు.

## 'డెన్సో'రాకతో వాహనాల పరిశ్రమకు ఊతం

### మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, నవంబరు 6:** భారీ పెట్టుబడులు, ఆవిష్కరణల అనుకూల వాతావరణంతో వాహనాల ఉత్పత్తి రంగంలో తెలంగాణా కీలక రాష్ట్రంగా అవతరిస్తోందని ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆశాభావం వ్యక్తం చేసారు. రాష్ట్రంలోని ఆటోమోటివ్ డిజైన్, చిప్ ల తయారీ, సెన్సార్ ఇంజినీరింగ్ సంస్థలు ఆటోమోటివ్ రంగ అభివృద్ధికి ఇతోధికంగా తోడ్పతాయని అన్నారు. బుధవారం నాడు జపాన్ కు చెందిన వాహనాల విడిభాగాల తయారీ సంస్థ 'డెన్సో' స్టార్టప్ ఇన్‌క్యుబేటర్ టిహబ్ తో భాగస్వామ్య ఒప్పందం కుదుర్చుకున్న సందర్భంగా ఆయన ప్రసంగించారు. ఆటోమోటివ్ రంగంలో దేశం ఇప్పటికే ప్రపంచంలో మూడో స్థానంలో ఉందని శ్రీధర్ బాబు వెల్లడించారు. మహీంద్రా అండ్ మహీంద్రా, భారత్ ఫోర్జ్, ఎక్సైడ్, అమర రాజా బ్యాటరీస్ వంటి దిగ్గజ సంస్థలు అత్యాధునిక ఉత్పత్తి కేంద్రాలను నెలకొల్పడం ద్వారా, సంప్రదాయ ఆటోమోటివ్ కాంపోనెంట్స్, నూతన ఎలక్ట్రిక్ వాహన సాంకేతికతలకు తెలంగాణ కేంద్రంగా మారిందని ఆయన హర్షం వ్యక్తం చేసారు.

# వరి దిగుబడిలో రికార్డు

### 1.50 కోట్ల టన్నుల దిగుబడి అంచనా

**హైదరాబాద్, నవంబరు 6, ప్రభాతవార్త :** వరి దిగుబడిలో తెలంగాన రికార్డు సృష్టించబోతోంది. ఖరీఫ్ సీజనులో తెలంగాణ వ్యాప్తంగా 60.80 లక్షల ఎకరాల్లో వరి పంటను సాగు చేయగా, తద్వారా 1.50 కోట్ల టన్నుల ధాన్యం దిగుబడి అవుతుందని రాష్ట్ర ప్రభుత్వం అంచనా వేసింది. ఈ దిగుబడిలో 91 లక్ష టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో 47 లక్షల టన్నులు సన్న రకాలుకు చెందని ధాన్యం కాగా, 44 లక్షల టన్నుల ఎకరాలు దొడ్డు రకం ధాన్యంగా అంచనా వేసింది.

## సర్వర్ సమస్యతో తెలంగాణవ్యాప్తంగా నిలిచిపోయిన మద్యం సరఫరా

**హైదరాబాద్, నవంబరు 6, ప్రభాతవార్త :** సాంకేతిక సమస్య కారణంగా తెలంగాణవ్యాప్తంగా మద్యం సరఫరా నిలిచిపోయింది. మద్యం డిపోల నుంచి డీలర్లు మద్యం తెచ్చుకోలేని పరిస్థితి ఏర్పడింది. దీంతో దుకాణాలకు సరఫరా, బిల్లింగ్ ప్రక్రియ పూర్తిగా ఆన్‌లైన్ ప్రక్రియ ద్వారానే కొనసాగింది. ఈ నేపథ్యంలో డీలర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు,. బుధవారం రాత్రి లోపు సర్వర్ సమస్య పరిష్కారం అవుతుందని ఎక్సైజ్ శాఖ అధికారులు చెప్పారు. గతంలో కూడా మద్యం డిపోలలో గతంలో కూడా ఇదే విధంగా సాంకేతిక సమస్య తలెత్తడంతో వెంటనే సరిదిద్దారు.

# విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యం

### గంజాయి, డ్రగ్స్ ఎక్కడ కనిపించినా 100కు డయల్ చేయండి

### 14న ఫేజ్2 ఇంటెగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ మంజూరు చేస్తాం

### సంక్షేమ హాస్టళ్ల విద్యార్థులతో సిఎం రేవంత్‌రెడ్డి ముఖాముఖి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, నవంబరు 6:** విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే మా లక్ష్యమని, అందరికి విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. అందుకే డైట్, కాస్మోటిక్ చార్జీలు పెంచామని, 21వేల మంది ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించామని, 11,062 ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేసామని వివరించారు. ప్రభుత్వ వసతి గృహ విద్యార్థులకు డైట్, కాస్మోటిక్ చార్జీలు పెంచిన నేపథ్యంలో సంక్షేమ హాస్టల్స్ విద్యార్థులు బుధవారం సచివాలయంలో రేవంత్‌రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఖమ్మం జిల్లా వైరా, మధిర నియోజకవర్గాల నుంచి సచివాలయానికి తరలి వచ్చిన మహాత్మాజ్యోతిభాపూలే, సాంఘీక సంక్షేమ హాస్టల్స్ పాఠశాల, కళాశాల విద్యార్థులతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవంబర్ 14న 15వేల మంది విద్యార్థులతో ఒక మంచి కార్యక్రమం తీసుకుంటున్నామని తెలిపారు. అదే రోజు ఫేజ్2 ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ మంజూరు చేయబోతున్నామని వెల్లడించారు. దేశ నిర్మాణంలో మీరు భాగస్వామ్యం కావాలిసామాజిక న్యాయం అందించేందుకు ప్రభుత్వం కుల గణన సర్వే నిర్వహిస్తోందని వివరించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల కోసం యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మిస్తున్నామన్నారు. ప్రతీ నియోజకవర్గంలో 20 నుంచి 25 ఎకరాల్లో ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మిస్తున్నామని, వచ్చే అకడమిక్ ఇయర్ లోగా నిర్మాణాలు పూర్తి చేయాలని ప్రభుత్వం భావిస్తోందని తెలిపారు.. చదువుతో పాటు స్కిల్ ఉంటేనే ఉద్యోగాలు లభిస్తాయి. అందుకే విద్యార్థి, నిరుద్యోగులకు నైపుణ్య శిక్షణ అందించేందుకు యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేసామన్నారు. టాటా ఇనిస్టిట్యూట్ సహకారంతో ఐటీఐలను ఏటీసీలుగా మారుస్తున్నామని, సాంకేతిక నైపుణ్యంతో పాటు ప్రభుత్వం ఉద్యోగ భద్రతను కల్పిస్తోందన్నారు. చదువుతో పాటు విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి. విద్యార్థులు క్రీడల్లో రాణించాలని వారిని ప్రోత్సహించే ప్రయత్నం చేస్తున్నామన్నారు. వచ్చే ఒలింపిక్స్ లక్ష్యంగా యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేయబోతున్నాని తెలిపారు. ఇవాళ్టి విద్యార్థులు రేపటి పౌరులుగా మారి తెలంగాణ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.



సచివాలయం రాష్ట్రానికి గుండెకాయ లాంటిది. ఉన్నత చదువులు చదివి భవిష్యత్ లో మీరు సచివాలయంలో అడుగు పెట్టాలని సూచించారు. పరిపాలనలో భాగస్వాములు కావాలని ఆకాంక్షిస్తున్నానని తెలిపారు. గంజాయి, డ్రగ్స్ ఎక్కడ కనిపించినా 100కు డయల్ చేసి సమాచారం అందించాలని సూచించారు. వ్యసనాలకు బానిసైతే జీవితాలు నాశనం అవుతాయని పేర్కొన్నారు. ప్రతీ ఒక్కరు సామాజిక బాధ్యతను అలవరచుకోవాలని పిలుపునిచ్చారు. కాగా, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీలు బలరాం నాయక్, రామసాయం రఘురాంరెడ్డి, ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ, ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సర్వేపై ఎలాంటి అపోహాలు వద్దు

### సమగ్ర సర్వేకు ప్రజలు స్వచ్ఛందంగా సహకరించాలి

### శంకర్‌పల్లిలో కుల సర్వేను ప్రారంభించిన మంత్రి శ్రీధర్‌బాబు



సమావేశంలో మాట్లాడుతున్న ఐటీ ఇండస్ట్రీస్ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి హైదరాబాద్, నవంబరు 6 ప్రభాతవార్త :** ప్రభుత్వం చేపట్టిన ఇంటింటి సర్వేతో రేషన్ కార్డులు, ఆరోగ్య శ్రీ కార్డులు పోతాయని ప్రజల్లో అపోహాలు ఉన్నాయని, అలాంటిది ఏమి ఉండదని ఐటీ ఇండస్ట్రీస్ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు స్పష్ట చేశారు. అన్ని వర్గాల ప్రజలకు రాజకీయ, సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి అవకాశాలు మెరుగు పరిచేందుకు ఈ సర్వే చేవడుతున్నామని వెల్లడించారు. బుధవారం శంకర్‌పల్లిలో సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వేను ఎమ్మెల్యే యాదయ్య, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి. నారా యణరెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ... ప్లానింగ్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ సర్వేలో ప్రతి 150 ఇండ్లకు ఒక ఎన్యూ మరేరట్‌ను నియ మించామని చెప్పారు. ఈ సర్వే ఆధారంగా అన్ని వర్గాల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించి ముందుకెళ్తామని చెప్పారు. ఇంటింటి సర్వేలో భాగంగా ఈ నెల 6, 7, 8 తేదీలలో మూడు రోజుల పాటు ఇంటి గుర్తింపు కార్యక్రమం చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ నెల 9వ తేదీ నుండి సమగ్ర కుటుంబ వివరాల సేకరణ ప్రారంభమవుతుందని, గుర్తింపు చేసిన గృహాలకు స్టిక్కర్లు అందించడం జరుగుతుందని తెలిపారు. ప్రతి కుటుంబాన్ని సామాజిక, ఆర్థికంగా మెరుగుపరచడమే ప్రభుత్వ ఉద్దేశమని అన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డి మాట్లాడుతూ.. సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ప్రారంభమైందని అన్నారు. ఒక్కో ఎన్యూమరేటర్‌కి 150 గృహాలను కేటాయించామన్నారు.

రానున్న మూడు రోజులు ఇంటి గుర్తింపు కార్యక్రమం చేపడుతామని, గుర్తింపు చేసిన గృహాలకు స్టిక్కర్లు అందించడం జరుగుతుందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూధన్‌రెడ్డి, నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ పామెన భీంభరత్, అడిషనల్ కలెక్టర్ ప్రతిమా సింగ్, మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# రాజ్యాగ లక్ష్యాల సాధనకే కులగణన చేపట్టాం

### సర్వేలో సేకరించిన సమాచారం గోప్యంగా ఉంచుతాం: భట్టి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, నవంబరు 6:** రాజ్యాంగ లక్ష్యాల సాధన కోసం అందరికీ సమాన అవకాశాలు, అందరికీ రాజకీయ, ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి ఫలాలు అందించేందుకే తెలంగాణ ప్రభుత్వం కులగణన ప్రక్రియను చేపట్టిందని డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ప్రభుత్వంపై ఆర్థిక భారం తగ్గించుకునేందుకు రేషన్ కార్డులు, పింఛన్లలో కోత పెట్టడానికే కులగణన సర్వే చేపట్టారన్న విపక్షాల విమర్శలు అవాస్తవమని కొట్టిపారేశారు. బుధవారం ఆయన ప్రజాభవన్‌లో మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర సంపద అందని వారందరికీ సంపదను అందించే కార్యక్రమమే కులగణనగా చెప్పుకొచ్చారు. కుల గణనపై ఎన్నికలకు ముందే... దేశ వ్యాప్తంగా రాహుల్‌గాంధీ ఎన్నికల్లో ప్రచారం చేశారన్నారు. కులగణనతో వనరులు, ఆస్తులు సమానంగా అందాలన్నదే తమ విధానమని, అయినప్పటికీ కొద్దిమంది తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. వారికి మాత్రమే ఫలాలు అందాలని అనుకునేవారే తప్పుడుప్రచారం చేస్తున్నా రన్నారు.

**వనరుల సమీకరణపై దృష్టి సారించాలి**

ప్రజలపై భారం మోపకుండా వనరుల సమీకరణ పై అన్ని శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు సూచించారు. బుధవారం ప్రజాభవన్ లో రెవిన్యూ మొబిలైజేషన్ పై కమర్షియల్ టాక్స్, ట్రాన్స్పోర్ట్, స్టాంప్స్ అండ్ రెవెన్యూ, టీజీ ఎండిసి, ఎక్సైజ్, తదితర శాఖలో ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాఖల వారీగా నిర్దేశించుకున్న ఆదాయ లక్ష్య సాధనలో ప్రతి నెల పురోగతి సాధించాలన్నారు. డిప్యూటీ సీఎం మాట్లాడుతూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టే పన్ను ఎగవేతదారుల పట్ల అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించారు.

# కాంగ్రెస్ ప్రభుత్వ హాయాంలో వేగంగా దేవాలయాల అభివృద్ధి

### యాదగిరిగుట్టను వైభవోపేతంగా తీర్చిదిద్దేలా కార్యాచరణ ప్రణాళిక

### యాదాద్రి దేవాలయ అభివృద్ధి పనులపై మంత్రి కొండా సురేఖ సమీక్ష



**హైదరాబాద్, నవంబరు 6, ప్రభాతవార్త :** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత దేవాదాయ శాఖ చేపట్టిన అభివృద్ధి పనులు సామాన్య భక్తులకు ఎంతో ఊరట ఇచ్చాయని రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. వైటిడిప ఆధ్వర్యంలో చేపడుతున్న యాదగిరిగుట్ట దేవాలయ అభివృద్ధి పనుల పురోగతిపై బుధవారం తెలంగాణ సచివాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వైటిడిప ఏర్పాటు, వైటిడిప ఆధ్వర్యంలో చేపట్టిన పనులు, భూసేకరణ, గత ప్రభుత్వ హాయంలో అర్థాంతరంగా నిలిచిపోయిన అంశంపై వైటిడిప వైస్ చైర్మన్ కిషన్ రావును అడిగి తెలుసుకున్నారు. వైటిడిప ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించిన వివరాలు తదితర అంశాలకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని గురువారంలోగా సమర్పించాలని ఆదేశించారు. ప్రస్తుతం వైటిడిప పరిధిలో ఉన్న భూమి, భూ బదలాయింపులు తదితర వివరాలపై మంత్రి ఆరా తీశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తరువాత యాదగిరిగుట్టపై జరిగిన పలు అభివృద్ధి పనులను ఈవో భాస్కర రావు పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా మంత్రికి వివరించారు. నిత్యం వేలాది మంది స్వామి వారిని దర్శించుకుంటున్న నేపథ్యంలో ప్రసాదం కౌంటర్ల పెంపు, ప్రత్యేక దర్శనం క్యూలైన్ వద్ద నీడకోసం షెడ్ల ఏర్పాటు, పాలిచ్చే తల్లుల కోసం లాక్టేషన్ గది వంటివి ఏర్పాటు చేసినట్లు వివరించారు. ప్రతీ నిత్యం అలయంలో నిర్వహించే స్వామివారి విశేష సేవలు భక్తులు వీక్షించేందుకు వీలుగా ఎల్ఐసిడి స్క్రీన్ ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం హంగు, ఆర్భాటాలకు పోయింది తప్ప సామాన్య భక్తులు దైవ దర్శనం సమయంలో ఎదుర్కొంటున్న కష్టాలను అసలు పట్టించుకోలేదన్నారు. యాదగిరిగుట్టను వైభవోపేతంగా తీర్చిదిద్దేందుకు సమర్థవంతమైన కార్యాచరణ ప్రణాళికతో ముందుకు పోతామని ఈ సందర్భంగా మంత్రి సురేఖ స్పష్టం చేశారు.



# పార్లమెంటరీ ప్రక్రియలో కృత్రిమ మేధస్సు ఎంతో ఉపయోగం

### సిడ్నీలో సిపిఎ సదస్సులో ప్రసంగించిన స్పీకర్ ప్రసాద్‌కుమార్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, నవంబరు 6:** ఆస్ట్రేలియా, సిడ్నీలో జరుగుతున్న 67వ కామన్వెల్త్ పార్లమెంటరీ అసోసియేషన్ (సిపిఎ) కాన్ఫరెన్స్‌లో పాల్గొనేందుకు తెలంగాణ శాసన బృందం వెళ్లింది. శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్ ముదిరాజ్, అసెంబ్లీ కార్యదర్శి డా.వి.నరసింహాచార్యులు బుధవారం ప్రధాన వేదిక ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్ (ఐసిసి), సిడ్నీలో తెలంగాణ రాష్ట్ర శాసనసభ తరుపున 'పార్లమెంటరీ ప్రక్రియలో కృత్రిమ మేధస్సు ఉపయోగం, ఆచరణకు అవకాశాలు– సవాళ్లు' అంశంపై రాష్ట్ర శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ ప్రసంగించారు. ఆధునిక కాలంలో కృత్రిమ మేధస్సు (ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్–ఎఐ)ను ఉపయోగించడం ద్వారా పార్లమెంట్ పనితీరు సమర్థవంతంగా, పారదర్శకంగా ఉంటూ అందరికీ అందుబాటులో ఉంటుంది. భారతదేశంతో పాటుగా కామన్వెల్త్ దేశాలలో ఎఐ వాడడం అనేది అనివార్యంగా మారిందన్నారు. ఎఐను ఉపయోగించడం ద్వారా శాసన వ్యవస్థలపై పౌరుల శోదన సమయం క్రమబద్ధీకరించబడిందన్నారు. పార్లమెంటరీ ప్రక్రియలో ఎఐ ప్రవేశించి కొద్ది కాలమే అయినా వేగంగా విస్తరిస్తుందన్నారు. కృత్రిమ మేధస్సును భారతదేశంతో పాటుగా ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశాల పార్లమెంట్‌లలో విస్తృతంగా ఉపయోగిస్తున్నారు. ఉదాహరణకు ఇంగ్లండ్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ దేశాల పార్లమెంట్‌లలో ఎఐ వినియోగం ద్వారా విప్లవాత్మకమైన మార్పులు రావడం మనం గమనించవచ్చునని తెలిపారు.

**తెలంగాణ వేగంగా అభివృద్ధి చెందుతుంది: సుఖేందర్‌రెడ్డి**

తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ భారతదేశం ప్రజాస్వామ్య దేశమని, ప్రజలచే ప్రభుత్వం ఏర్పాటు చేసుకోబడుతుందని తెలిపారు. అన్ని వర్గాల ప్రజలకు సమాన హక్కులు, సంపద లభించే విధంగా రాజ్యాంగం రచించబడిందని ఆయన వివరించారు. చట్ట సభల ద్వారా చట్టాలను రూపొందించి, అధికారులతో సమన్వయం చేసుకుంటూ దేశాన్ని అభివృద్ధిచేసుకొంటున్నామని ఆయన వివరించారు. భారతదేశం అన్ని రంగాల్లో వేగంగా అభివృద్ధి చెందుతుందని, అలాగే తెలంగాణ రాష్ట్రం కూడా వేగంగా అభివృద్ధి చెందుతుందని తెలిపారు.

## ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌పై విచారణ మళ్లీ వాయిదా

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, నవంబరు 6:** పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని దాఖలైన పిటీషన్‌పై విచారణ మరోసారి వాయిదా పడింది. ఈ కేసు విచారణను గురువారం నాటికి వాయిదా వేస్తూ డివిజన్ బెంచ్ నిర్ణయం తీసుకుంది. ఎమ్మెల్యేల అనర్హత వేటు పిటీషన్‌లో హైకోర్టు సింగిల్ బెంచ్ ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ అసెంబ్లీ కార్యదర్శి డివిజన్ బెంచ్‌లో అప్పీల్ చేసిన విషయం తెలిసిందే. ఇప్పటికే ప్రభుత్వం తరఫు వాదనలు వినిపించిన అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి బిఆర్ఎస్ ఎమ్మెల్యేల అనర్హత పిటీషన్ కొట్టివేయాలని బెంచ్‌ను కోరారు. ఈ కేసులో పిటీషనర్ల తరఫు వాదనలు కొనసాగుతున్నాయి. బుధవారం కోర్టు సమయం ముగియడంతో కేసును గురువారంనాటికి వాయిదా వేసున్నట్లు ధర్మాసనం తెలిపింది.

# వృద్ధులే లక్ష్యంగా సైబర్ నేరగాళ్ల మోసాలు

### డిజిటల్ అరెస్టు పేరిట లూటీలు

### ఇటీవల జరిగిన రూ.142 కోట్ల లూటీలో రూ.45 కోట్లు విశ్రాంత ఉద్యోగులవే

**హైదరాబాద్, నవంబరు 6, ప్రభాతవార్త:** సైబర్ నేరగాళ్లు రూటు మార్చారు. వయో వృద్ధులను, విశ్రాంత ఉద్యోగులను పథకం ప్రకారం టార్గెట్ చేస్తూ అనేక రకాలుగా వారిని హడలెత్తిస్తూ డిజిటల్ అరెస్టు పేరిట భయపెడుతూ లక్షలాది రూపాయల నుంచి కోట్లాది రూపాయలను లూటీ చేయసాగారు. ఇటీవల కాలంలో సైబర్ నేరగాళ్లు దోచుకున్న 142 కోట్ల రూపాయల నగదులో 45 కోట్ల రూపాయలు వృద్ధులు, విశ్రాంత ఉద్యోగులవేనని పోలీసు గణాంకాలు చెబుతున్నాయి. విశ్రాంత ఉద్యోగులు, వయో వృద్ధులు ఇళ్లలో ఒంటరిగా వుంటూ శేష జీవితాన్ని కృష్ణా రామా అంటూ కుటుంబ సభ్యులతో లేదా ఒంటరిగా లేదా దైవ చింతనతో వెళ్ల దీస్తుండగా వారిని సైబరాసురులు టార్గెట్ చేస్తున్న తీరు పోలీసులను సైతం ఆశ్యర్య పరుస్తోంది ఒక పథకం ప్రకారం వారికి ఫోన్లు చేస్తున్న సైబర్ నేరగాళ్లు మీకు డ్రగ్స్ పార్శిల్ వచ్చిందనో...? విదేశాల నుంచి అక్రమంగా ఆయుధాలు రప్పించారనో...? విదేశాల్లోవున్న మీ అబ్బాయి నేరం చేశాడనో...? బెదిరిస్తున్నారు. డిజిటల్ అరెస్టు, స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడుల పేరిట ఇటీవల కాలంలో ఒక్క హైదరాబాద్‌లోనే 30 కోట్ల రూపాయలను సైబర్ నేరగాళ్లు దోచుకున్నారు. ఇందులో గత సెప్టెంబర్ నెలలో హైదరాబాద్‌లో స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడుల పేరిట ఓ వృద్ధుడిని 13.16 కోట్ల రూపాయలు, కూకట్ పల్లిలో మరో వయో వృద్ధుడిని 5,93 కోట్ల రూపాయలను సైబర్ నేరగాళ్లు కాజేశారు. మరో ఘటనలో మీ ఫోన్ నుంచి బెదిరింపు కాల్స్ వచ్చాయని అరెస్టు తప్పదని బెదిరించి 75 ఏళ్ల విశ్రాంత ఉన్నతాధికారి నుంచి 4.82 కోట్ల రూపాయలను కాజేశారు. మరో ఘటనలో మనీలాండరింగ్ పేరిట 80 ఏళ్ల వృద్ధుడిని బెదిరింపి 4.98 కోట్ల రూపాయలను కాజేశారు.

**అసలు నేరగాళ్లు విదేశాల్లో.. కొసరు నేరగాళ్లు భారత్‌లో**

ఇదిలావుండగా వయో వృద్ధులు, విశ్రాంత అధికారుల ఫోన్‌ల నుంబర్లను సైబర్ నేరగాళ్లు ఒక పథకం ప్రకారం కాజేస్తున్నారు. ఫోన్ నంబర్లను సమకూర్చే కొన్ని ముఠాల నుంచి వీరికి ఇవి అందుతున్నాయని పోలీసులు చెబుతున్నారు. అనంతరం మాయమాటలతో మభ్యపెడుతుండడం, లేదా అనేక కారణాలు చూపుతూ మోసాలకు పాల్పడుతుండడం చేస్తున్నారు. ఇక ఈ తరహా నేరాలకు పాల్పడుతున్న ముఠాలకు నాయకులు దుబాయ్, చైనా సహా పలు దేశాల్లో సురక్షితంగా వుంటుండగా వారికి కమీషన్ ప్రాతిపదికన బ్యాంకు ఖాతాలు సమకూరుస్తున్న కొసరు నేరగాళ్లు భారత్‌లో వుంటున్నారు.

# సుంకిశాల పాపం కాంట్రాక్టరుదే

>> అడగుల నుంచి 450 అడుగుల వరకు వాటర్‌లెవల్ ఏ దశలో ఉన్నా సొరంగమార్గం ద్వారా సుంకిశాల పంప్‌హౌజ్‌లోకి నీటిని తరలించే విధంగా డిజైన్ చేశారు. కానీ 530 అడుగుల నీటి ధాటినే రిటైనింగ్ వాల్ తగ్గుకోలేదని, దీనికి నిర్మాణలోపం కారణమని నివేదికలో నిపుణుల కమిటీ స్పష్టం చేసింది. పంప్‌హౌజ్‌లో మోటర్లు బిగించిన తరువాత సొరంగం పనులు పూర్తిచేస్తారని, కానీ ఇక్కడ అధికారులు మోటర్లు బిగించక ముందే మూడు సొరంగ మార్గాల్లో మూడో మార్గాన్ని తెరిచి ఉంచారని వెల్లడించారు. రిటైనింగ్ వాల్ గేట్ల నిర్మాణం పూర్తికాకపోవడంతో సొరంగ మార్గాన్ని తెరిచే ఉంచడంతో ఈ ప్రమాదం జరిగినట్లు తేల్చింది. ఆగస్టు 1 ఉదయం పని ముగించుకుని పంప్‌హౌజ్ నుంచి వెళ్లిపోయిన సిబ్బంది, భయంతో రెండో షిఫ్ట్‌లో పనిచేయడానికి రాలేదని, లేదంటే భారీగా ప్రాణనష్టం జరిగేదని స్పష్టం చేసింది. ఈ మొత్తం వ్యవహారంలో కాంట్రాక్టరుది నిర్లక్ష్యం ఉందని, సదరు సంస్థను బ్లాక్‌లిస్టులో పెట్టాలని సైతం కమిటీ సూచించినా ప్రభుత్వం మాత్రం ఇప్పటి వరకు చర్యలు తీసుకోకపోవడం గమనార్హం.

సుంకిశాల ఘటనపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన ఆరోపణలకు జలమండలి వివరణ ఇచ్చింది. సుంకిశాల నుండి హైదరాబాద్ నగరానికి నీళ్లు తీసుకురావడానికి కట్టిన ప్రాజెక్టు ఇన్‌టెక్ వెల్ కుంగుబాటుకు గురైతే ఎందుకు చర్యలు తీసుకోలేదు, కాళేశ్వరం పిల్లర్లు కుంగితే మీరు కమిషన్ వేశారు కదా. సుంకిశాల కాంట్రాక్టు సంస్థను బ్లాక్ లిస్ట్ లో పెట్టాలని విచారణ కమిటీ చెప్పినా ప్రభుత్వం చర్యలు తీసుకోలేదని కెటిఆర్ ప్రశ్నిస్తే జలమండలి సమాధానం ఇచ్చింది. సుంకిశాల ప్రాజెక్టు గోడ కూలిన ఘటనపై జలమండలి విచారణ కమిటీ ఏర్పాటు చేసింది. కమిటీ సమర్పించిన నివేదికలో.. వర్షాకాలానికి ముందు, నిర్దేశిత సమయంలో పనులు పూర్తి చేయకపోవడంతో నోటీసులు జారీ చేయాలని ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. సాంకేతిక నిపుణుల కమిటీ ద్వారా సమగ్ర విచారణకు సిఫార్సు చేయడం జరిగిందన్నారు. ప్రభుత్వం ఆదేశాల మేరకు రాష్ట్ర విజిలెన్స్, ఎన్ ఫోర్స్ మెంట్ డిపార్ట్ మెంట్.. ఇదే ఘటన మీద విచారణ చేపట్టింది. విచారణ పూర్తి అయిన తర్వాత.. సమర్పించే నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. కాళేశ్వరం నీళ్లను గండి పేటలో కలిపి మూసీలోకి పంపిస్తారంట. దీనికోసం రూ. 5,500 కోట్లు ఖర్చు చేస్తారంట. ఇది మరొక కుంభకోణం. కొండ పోచమ్మ సాగర్ నుంచి గోదావరి నీళ్లను హైదరాబాద్ తెచ్చేందుకు మేము రూ. 11 వందల కోట్లతో ఖర్చుతో అన్ని సిద్ధం చేశాం. కానీ పెద్ద ఎత్తున కుంభకోణం చేసేందుకే దీన్ని రూ. 5,500 కోట్లకు పెంచారు. ఈ ప్రాజెక్ట్ ను కూడా ఈస్ట్ ఇండియా కంపెనీ అన్న మేఘా సంస్థకే ఇవ్వటానికి అన్ని ఒప్పందాలు కుదుర్చుకున్నారన్న మాజీ మంత్రి వ్యాఖ్యలపై స్పందించిన జలమండలి హిమాయత్ సాగర్, ఉస్మాన్ సాగర్ పునరుజ్జీవానికి.. మల్లన్న సాగర్ నుంచి నీళ్లు తీసుకురావడానికి గోదావరి ఫేజ్2 పథకం రూపకల్పన చేశారు. 15 టీఎంసీల నీటిని తరలించేందుకు మల్లన్న సాగర్ నుంచి ఘన్ పూర్ వరకు 3600 ఎంఎం డయా పైపులైన్ నిర్మాణం. ఘన్ పూర్ నుంచి ముత్తంగి వరకు 2400 ఎంఎం డయా క్లియర్ వాటర్ పైపు లైన్ నిర్మాణం. ఇది 3000 ఎంఎం డయా రింగ్ మెయిన్ కు అనుసంధానమై ఉంటుంది. మూసీ పునరుజ్జీవం కోసం ఘన్ పూర్ నుంచి ఉస్మాన్ సాగర్ వరకు 2200 ఎంఎం డయా పైపు లైన్ నిర్మాణం. దీని ద్వారా 5 టీఎంసీల నీరు తరలించవచ్చు. దీంతో పాటు కొల్లూరు నుంచి కండ్లకోయ వరకు ఓఆర్ఆర్ పరిసరాల్లో ఉన్న శామీర్ పేట్, కిష్టారెడ్డిపేట్, గంధిగూడెం, బౌరంపేట్, దుండిగల్, శంభీపూర్, గౌడవెల్లి సరస్సులను నింపనున్నామని, హైదరాబాద్ నగర తాగునీటి అవసరాలకు 10 టీఎంసీలు, మూసీ నది పునరుజ్జీవంతో పాటు హిమాయత్ సాగర్, ఉస్మాన్ సాగర్ రిజర్వాయర్లను నింపడానికి 5 టీఎంసీల నీరు కావాలి. ఇదే కాకుండా.. ఓఆర్ఆర్ పరిసరాల్లో ఉన్న ఏడు సరస్సులను నింపడంతో పాటు వాటి నీటి స్థాయిల్ని కాపాడటం. దీనికోసం టెండర్ జారీ ప్రక్రియ జరుగుతోంది. రూ.1100 కోట్లతో కొండ పోచమ్మ సాగర్ నుంచి హైదరాబాద్ తాగునీటి అవసరాలకు జలమండలి ఇప్పటి వరకు అంచనాలు రూపొందించలేదని పేర్కొన్నారు. గోదావరి నీళ్లను హైదరాబాద్ కు తెచ్చేందుకు రూ. 11 వందల కోట్లతో అయిపోయే దానికి రూ. 5500 కోట్ల భారీ స్కాం చేయబోతున్నారని పేర్కొన్నగా రూ.1100కోట్లతో కొండ పోచమ్మ సాగర్ నుంచి హైదరాబాద్ తాగునీటి అవసరాలకు జలమండలి ఇప్పటి వరకు అంచనాలు రూపొందించలేదంటూ ఒక ప్రకటనలో తెలిపింది.

